క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 17, వంకాయ 28, బెండ 55, పచ్చి మిర్చి 40, కాకర 35, బీర 45, క్యాబేజి 10, ఫ్రెంచిబీన్స్ 40, క్యారెట్ 19, దొండ 35-40, చిక్కుడు 50, గోకర 40, బీట్‌రూట్ 17, క్యాప్సికం 55, ఆలు 23, దోస 28, సొర 13, పొట్ల 15, ఉల్లి 22, చామగడ్డ రూ. 70 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేడు ఉచిత వైద్య శిబిరం

వనస్థలిపురం: బీపీసీఎల్ (భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్), అవేర్ (అవేర్ హెల్త్ అండ్ రిసెర్చ్ ఫౌండేషన్, నేషనల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్)ల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఆటోనగర్‌లో లారీల అడ్డా వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సంబంధిత అధికారి ఎస్.వెంకన్న తెలిపారు. అంకిత, కామినేని ఆస్పత్రులకు చెందిన ప్రముఖ వైద్యులు గుండె జబ్బులు, నరాలు, షుగర్, కంటి వైద్యం, హోమియోపతి, డెంటల్ తదితర సమస్యలపై పరీక్షలు నిర్వహిస్తాన్నారు. వారికి తగిన సూచనలు, సలహాలు ఇస్తారని ఆయన వివరించారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నియామకం


సుల్తాన్ యాదగిరి

నాగోలు: తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాగోలు డివిజన్ వెంకటరణ కాలనీ చెందిన సుల్తాన్ యాదగిరి నియమితులయ్యారు. ఈ మేరకు నియామ ఉత్తర్వులను రాష్ట్ర అధ్యక్షుడు గోర శ్యామ్‌సుందర్‌గౌడ్ ఆదివారం ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ... రాష్ట్రంలో వనరుల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో భాగస్వాములమై రాష్ట్ర మా లక్ష్యం-వనరుల కాపాడుకోవడం మన కర్తవ్యం అనే నినాదంతో సంఘం పనిచేస్తుందన్నారు. తనపై నమ్మకంతోని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన శ్యామ్ సుందర్‌గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వినాయకహిల్స్‌లో శ్రమదానం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ వినాయకహిల్స్ కాలనీలో ఆదివారం కార్పొరేటర్ బోయపల్లి దీపికాశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులు శ్రమదానం నిర్వహించారు. కాలనీలో ఉన్న ఇళ్ల ఎదుట, రోడ్లకు ఇరువైపుల పేరుకుపోయిన పిచ్చి మొక్కలు., చెట్లు తొలగించి శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి కాలనీల్లో శుభ్రతను పాటించాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, నిషేధిత కవర్లను వాడకూడదని కాలనీవాసులను కోరారు. పచ్చదనం పర్యావరణం అందరి బాధ్యత అని గుర్తు చేశారు. గుంతలమయమైన రోడ్లల్లో తాత్కాలికంగా మట్టి పోసి చదును చేశామన్నారు. త్వరలోనే మంత్రి సబితారెడ్డి దృష్టికి సమస్యను వివరించి సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేయిస్తామని చెప్పారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములమవుదామని పిలుపు నిచ్చారు. ఇంటిలోని తడి, పొడి చెత్తను చెత్త సేకరణదారులకే ఇవ్వాలని సూచించారు. వినాయకహిల్స్ కాలనీని బడంగ్‌పేట కార్పొరేషన్‌లో ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దేందుకు కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, కోశాధికారి శివకుమార్, అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, కాలనీవాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగ్గులు, ఆటల పోటీలు


ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేత రాజేశ్వర్‌రావు, తదితరులు

మీర్‌పేట: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మీర్‌పేటలోని జనప్రియా మహానగర్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులు, మ్యూజికల్ చైర్స్, చిన్నారులకు డ్రాయింగ్, లెమన్‌స్పూన్, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి సమతా నాలెడ్జ్ సెంటర్ నిర్వాహకులు డా.రాజేశ్వర్‌రావు న్యాయనిర్ణేతగా వ్యవహరించగా, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఇందిర, జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంధ్య, ఎస్.విజయలక్ష్మి, పద్మ, నిర్వాహకులు సలీమా, మస్తాన్‌బీ, స్వర్ణ, జన విజ్ఞాన వేదిక నాయకులు టి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ బ్రిడ్జి పిల్లర్ల కూల్చివేత

- రూ. 80 లక్షల ప్రజాధనం వృథా
- చంచల్‌గూడలో కొనసాగుతున్న నిర్మాణం
- అధికారులు పనితీరుపై సర్వత్రా ఆగ్రహం


బేస్‌మెంట్లు కూల్చిన తొలగించిన భారీ నట్‌బోల్ట్‌లు

చంచల్‌గూడ: చంచల్‌గూడ జైలు పెట్రోల్ పంపు నుంచి కుర్మగూడ, సైదాబాద్ మీదుగా ఓవైసీ చౌరస్తా వరకు ప్రభుత్వం ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్ట్ కింద 4 కిలోమీటర్ల పొడవునా నూతన స్టీల్ బ్రిడ్జి (ఫ్లై ఓవర్) నిర్మిస్తున్న విషయం తెలిసిందే. బ్రిడ్జి నిర్మాణం వ్యయం దాదాపు రూ. 298 కోట్లు. 2021 ఫిబ్రవరి నెలలో పనులను ప్రారంభించారు. దాదాపు 2 సంవత్సరాలు గడిచినా బ్రిడ్జి నిర్మాణ పనులు మాత్రం పూర్తి కాలేదు. స్టీల్ బ్రిడ్జి ఏర్పాటు కోసం కొన్ని పిల్లర్లు నిర్మాణం పూర్తి కాగా మరి కొన్ని నిర్మాణంలో ఉన్నాయి. బ్రిడ్జి కోసం మొత్తం 88 పిల్లర్లు నిర్మించనున్నారు. పిల్లర్ల ఏర్పాటు కోసం దాదాపు 8 ఫీట్ల వెడల్పుతో 10 అడుగులు పునాది తీసి బేస్‌మెంట్ నిర్మిస్తున్నారు.

- ఇదిలా ఉండగా చంచల్‌గూడ నుంచి ఐఎస్ సదన్ వరకు నిర్మాణం పూర్తి అయిన 4 బేస్‌మెంట్ పిల్లర్లు కూల్చి వేశారు. ఒక్కో బేస్‌మెంట్ వ్యయం దాదాపు రూ. 20 లక్షలుగా అంచనా. ఇలా దాదాపు రూ. 80 లక్షలు వృథా అయినట్లు తెలుస్తోంది.

అధికారులపై చర్యలు తీసుకోవాలి...

- స్టీల్ బ్రిడ్జి నిర్మాణం పనులు మొదలై రెండేళ్లు గడుస్తున్నా 50 శాతం కూడా పూర్తి కాలేదని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్ల రూపాయాల ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి పనులపై అధికారులు పర్యవేక్షణ కరువైందని ఆరోపించారు. అందుకే నిర్మాణంలో లోపాల వల్ల కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యిందన్నారు. ఇందుకు కారకులైన అధికారులపై ప్రభుత్వ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. చంచల్‌గూడ నుంచి ఐఎస్ సదన్ వరకు ఇంకా రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయకుండా బ్రిడ్జి నిర్మాణం చేపట్టారన్నారు. సైదాబాద్ చౌరస్తాలో ఒక్క వైపు మాత్రమే రోడ్డు వెడల్పు పనులు జరిగాయన్నారు.

టెక్నికల్ ఇబ్బందులతోనే కూల్చివేతలు...

- కూల్చివేతల విషయమై ప్రాజెక్ట్ ఈఈని వివరణ కోరగా బ్రిడ్జి నిర్మాణంలో కొన్ని టెక్నికల్ ఇబ్బందులు తలెత్తడంతో కాంట్రాక్ట్ ఏజెన్సీ వారు కూల్చినట్లు పేర్కొన్నారు. బ్రిడ్జి ప్లాన్‌లో ఎలాంటి మార్పులు లేవని, కూల్చిన చోటే నూతన బేస్‌మెంట్‌ల నిర్మాణం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.


చంచల్‌గూడ చౌరస్తాలో కూల్చిన పిల్లర్ బేస్‌మెంట్


ఐఎస్ సదన్‌లో కూల్చిన పిల్లర్ బేస్‌మెంట్

కాలనీల్లో మెరుగైన వసతులు కల్పిస్తా: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


అనంతలు కాలనీలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ అరుణ

నాగోలు: కాలనీల్లో మెరుగైన వసతులు కల్పించి... వాటి అభివృద్ధికి పెద్ద పీట వేస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నాగోలు డివిజన్ పరిధిలోని రూ. 62 లక్షలతో అనంతులకాలనీ, సాయినగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు, శ్రీమహాలక్ష్మి వాంబేకాలనీలో చిల్డ్రన్ పార్క్, వాకింగ్ ట్రాక్, బాలాజీ ఎంక్లేవ్ (ఏవీరెడ్డికాలనీ) సీసీ రోడ్డు పనులకు నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... నాగోలు డివిజన్ పరిధిలోని శివారు కాలనీల్లో డ్రైనేజీ, తాగునీరు, సీసీ రోడ్డు పనులతో పాటు ఇతర మౌలిక సదుపాయలు త్వరలోనే కల్పిస్తామని తెలిపారు. వివిధ కాలనీలో ఉన్న ఓపెన్ స్థలాలను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం బాలాజీ ఎంక్లేవ్ కాలనీవాసులు నోట్ పుస్తకాలను అందజేశారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, నేతలు సతీష్ యాదవ్, అనంతుల సురేందర్‌రెడ్డి, సతీష్‌యాదవ్, రంగేశ్వరి, నాగ భాస్కర్, విజయభాస్కర్, శ్యాంసుందర్ రెడ్డి, డప్పు రాజు, కట్ట ఈశ్వరయ్య, సుర్వీ రాజు, వివిధ కాలనీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సత్వరమే పూర్తిచేయాలి


సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న షఫీయుద్దీన్

చాదర్‌ఘాట్: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలని ఎంఐఎం ఓల్డ్‌మలక్‌పేట అధ్యక్షుడు షఫీయుద్దీన్ అధికారులను కోరారు. ఆదివారం ఆయన జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి డివిజన్‌లో పర్యటించారు. వాహెద్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అభివృద్ధి పనుల్లో నాణ్యత, ప్రమాణాలు కచ్చితంగా పాటించాలన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు ప్రదీప్‌కుమార్, సత్యనారాయణ, ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో పరిపూర్ణ ఆరోగ్యం

మూసారంబాగ్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి


మాట్లాడుతున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, పక్కన శ్రీనివాస్‌గుప్తా

మలక్‌పేట: క్రీడలు ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసాన్ని తద్వారా పరిపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తాయని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ టూరిజమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తాతో కలిసి దిల్‌సుఖ్‌నగర్ షటిల్ ప్లేయర్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్‌బీహెచ్ కాలనీ జీహెచ్ఎంసీ గ్రౌండ్స్‌లో చేపట్టిన రిపబ్లిక్‌డే బ్యాడ్మింటన్‌టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... యువత సోషల్ మీడియాతో సమయం వృథా చేయకుండా క్రీడల వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ... ప్రభుత్వం క్రీడా రంగానికి పెద్ద పీట వేసిందన్నారు. టోర్నమెంట్ నిర్వాహకులు కార్పొరేటర్‌ను సన్మానించారు. అసోసియేషన్ చైర్మన్ సామ ప్రభాకర్‌రెడ్డి, కన్వీనర్ కరెడ్ల శ్రీనివాసరావు, అధ్యక్షుడు దేవిడి శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ అనిల్, ఎం.లక్ష్మారెడ్డి, రాజగోపాల్, వెంకటేశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేశం పాల్గొన్నారు.

కార్పెంటర్స్ యూనియన్ మన్సూరాబాద్ అధ్యక్షుడిగా మధు


నాగార్జునపు మధు

మన్సూరాబాద్: తెలంగాణ కార్పెంటర్స్ యూనియన్ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా నాగార్జునపు మధును నియమించారు. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేల అనంతాచారి నియామక పత్రాన్ని జారీ చేసి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ... రానున్న బడ్జెట్ సమావేశాల్లో కార్పెంటర్స్‌కు నిధులు కేటాయించాలని, ఇళ్లులేని అర్హులైన కార్పెంటర్స్‌కు డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్పెంటర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

వెంకటరమణ కాలనీ నూతన కార్యవర్గం



వనస్థలిపురం: శ్రీ వెంకటరమణ కాలనీ (పడమర)లో ఆదివారం జరిగిన కాలనీ సర్వసభ్య సమావేశంలో కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుర్రం నవీన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా గంగుల వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బొడ్డుపల్లి వెంకటేష్, సంయుక్త కార్యదర్శిగా కుడుముల ప్రభాకర్ రెడ్డి, కోశాధికారిగా గోదల బుచ్చిరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా కాసుల మల్లేష్ ఎన్నికయ్యారు.

చండీ మహాయాగ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ ఫేజ్-2 కాలనీలోని శ్రీ రేణుక రాజేశ్వరి పీఠం జగన్మాత సేవా భవనంలో మొల్లురి నవీన్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రుద్ర నవ చండీ మహాయాగ పోస్టర్‌ను ఆదివారం కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ... రెండు సంవత్సరాలు ఈ యాగం నిర్వహించడం అభినందనీయమన్నారు. మహాయాగ నిర్వహణకు ఆయన రూ. లక్షను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నరసింహారెడ్డి, సందీప్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మధసూదన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దంత సంరక్షణపై అవగాహన

సాయి ఆలయంలో ఫ్రీ డెంటల్ క్యాంప్


దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్, క్లోవ్ డెంటల్ క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వంద మందికి పైగా శిబిరంలో వివిధ వైద్య పరీక్షలు చేయించుకున్నారని ఆలయ ట్రస్ట్ చైర్మన జి.మల్లయ్య తెలిపారు. దంత సంరక్షణపై వైద్యులు అవగాహన కల్పించారని అన్నారు. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శ వూర నర్సింహగుప్త, జాయింట్ సెక్రటరీలు వి.వి.రవికుమార్, ఎం.శ్యామలరావు, ఈసీ మెంబర్లు కోడి రాజశేఖర్, బి.కిరణ్‌కుమార్, సాయి కృష్ణ షిండే తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పల్లవి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ గురువు పీబీ కృష్ణభారతి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పూర్వ రంగం, గణేశా పంచరత్న కీర్తన, అష్టపది, నీలమేఘ, అమృత, శిరీష, శ్రీకృతి, రితిక, అనన్య, వర్ష ప్రదర్శించారు. పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటాచారి, కూచిపూడి నృత్య కళాకారిణి డాక్టర్ హిమబిందు కనోజ్ కళాకారులను అభినందించారు.

ఎల్‌బీనగర్‌లో బీజేపీ విజయం తథ్యం: వంగా


మాట్లాడుతున్న కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: రాబోయే ఎన్నికల్లో ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలో బీజేపీ జెండా ఎగురవేయటం ఖాయమని చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం కర్మన్‌ఘాట్‌లో డివిజన్ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి పార్టీ శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు, పోలింగ్ బూత్‌ల అధ్యక్షుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీజేపీ ఎల్‌బీనగ ప్రభారీ రాజశేఖర్‌రెడ్డితో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశం ప్రారంభించారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ... బీజేపీకి కార్యకర్తలే ఆయువుపట్టు అని అన్నారు. పార్టీ కార్యకర్తలు నిరంతరం కాలనీవాసులతో మమేకమై పార్టీని బూత్‌స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం డివిజన్ సభ్యులు శైలజ, సువర్ణ, శ్రీనిధి, నాయకులు యోగిరాజ్, శ్రీనివాస్, అంజి, రామాంజి, అవినాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వివరిస్తున్న రెడ్డి సంఘం ప్రతినిధులు

మన్సూరాబాద్: మన్సూరాబాద్ పెద్దచెరువు పరిధిలో ఉన్న రెడ్డి శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి కోరారు. ఆయన ఆధ్వర్యంలో రెడ్డి సంఘం ప్రతినిధులు ఆదివారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రెడ్డి శ్మశానవాటిక చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు చర్యలు చేపడుతానన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం ప్రతినిధులు గుర్రం బుచ్చిరెడ్డి, వెంకట్‌రెడ్డి, సంరెడ్డి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్కు పనుల ప్రారంభం

- నాగోలు డివిజన్ పరిధి వాంబే కాలనీలో చిన్న పిల్లల పార్కు పనులకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్‌తో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. కాలనీ ప్రతినిధులు రవి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి


న్యూమారుతీనగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్‌లో వివిధ కాలనీలో సమస్యలు లేకుండా చేసి డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. ఆదివారం న్యూమారుతీనగర్ రోడ్డు నెంబర్-11లో కార్పొరేటర్ పర్యటించారు. కాలనీలో సీసీ రోడ్డు, డ్రైనేజీ లైన్, విద్యుత్ దీపాలు ఇతర అంశాలపై చర్చించారు. కాలనీలో నెలకొన్న సమస్యలు అతి త్వరలోనే పరిష్కరిస్తానని తెలిపారు. కాలనీ నేతలు బొగ్గరపు కార్తిక్, బాలాజీ, బీజేపీ నాయకులు సుందర్ నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, కొత్త తిరుమల్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్నగౌడ్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

మన్సూరాబాద్: చంద్రపురికాలనీ సంక్షేమ సంఘ భవనంలో ఆరంజ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి పరిసర ప్రాంతాల ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. శిబిరాన్ని బీఎన్‌రెడ్డినగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్నగౌడ్ ప్రారంభించారు. ఈసీజీ, షుగర్, బీపీ, ఆర్థోపెడిక్ తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు వేమారెడ్డి, డీవీఎస్ శాస్త్ర, కొత్త రవికుమార్, వెంకటేష్, డాక్టర్ యశ్వంత్, డాక్టర్ నవీన్, డాక్టర్ సీమాసింగ్, డాక్టర్ గౌతమ్, డాక్టర్ సురేష్, డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ రాము తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురంలో...

ఎల్‌బీనగర్: వనస్థలిపురం లేబర్ అడ్డా వద్ద ఉన్న శ్రీ సాయి తేజస్వి ఆస్పత్రిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. శిబిరానికి విచ్చేసిన వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 70 మంది పాల్గొని వివిధ పరీక్షలు చేయించుకున్నట్లు నిర్వాహకుడు వీరస్వామి గౌడ్ తెలిపారు. వైద్యులు యమునదేవి, కుమార్‌భాను తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను బకాయిదారులకు రెడ్ నోటీసులు

చాదర్‌ఘాట్: మలక్‌పేట సర్కిల్-6 పరిధిలో ఆస్తి పన్ను వసూలు చేయటంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని గ్రేటర్ కమిషనర్ డీసీకి ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. దీంతో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్‌లు ఉదయం 9 గంటలకే ఆస్తిపన్ను వసూలుకు వెళ్తున్నారు. సర్కిల్-6 పరిధిలో మొత్తం రూ. 39 కోట్లు ఆస్తిపన్ను పెండింగ్‌లో ఉన్నట్లు, అందులో జనవరి 15లోపు రూ. 27 కోట్లు వసూలు చేసినట్లు డీసీ జయంత్ తెలిపారు. ఆస్తి పన్ను చెల్లించని మూడు వేల మంది ఇంటి యజమానులకు రెడ్ నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు సుమారు రూ. 12 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా నెలకు రూ. 7 కోట్లు వసూలు చేయాలని సిబ్బందికి టార్గెట్ ఇచ్చామన్నారు. ఇంటి పన్ను చెల్లించకేంటే వడ్డీ విధింపు ఎక్కువగా పడే అవకాశముందన్నారు. వసూళ్లలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇంటి యజమానులు అధికారులకు సహకరించి పన్నులు చెల్లించాలని ఆయన కోరారు.

స్వర్ణకారులకు ప్రభుత్వం అండ

- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట: చేతి వృత్తి దారులైన స్వర్ణకారులకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం చంపాపేట డివిజన్ పరిధిలోని ఏపీఆర్ గార్డెన్‌లో రాష్ట్ర స్వర్ణకార సంఘ అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంఘ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... స్వర్ణకారులు మారుతున్న కాలానుగుణంగా చేతి వృత్తులలో ఆధునిక యంత్రాల ఆధారంగా నైపుణ్యత సాధించి పోటీ మార్కెట్‌ను తట్టుకునేలా తయారవ్వాలని సూచించారు. రాఘవాచారి మాట్లాడుతూ... దొంగ బంగారం కొనుగోలు చేస్తున్నారనే నెపంపై పోలీసులు స్వర్ణకారులపై నిత్యం వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల వేధింపులు తట్టుకోలేక కుటుంబ సభ్యులు మొత్తం ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దొంగ బంగారం కొనుగోలు నేరంపై నిజనిర్ధారణ, వాస్తవికతను పరిశోధించిన తర్వాతే చర్యలు చేపట్టాలని కోరారు. స్వర్ణకారుల సమస్యలన్నింటినీ త్వరలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లి చేతి వృత్తిదారులైన స్వర్ణకారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘ కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, కిషన్‌రావు, కృష్ణ, భీష్మాచారి, రత్నమాచారి, వెంకట స్వామి, మారోజు జంగాచారి, రఘునాథాచారి, వెంకటాచారి, పద్మాచారి, వెంకటస్వామి, గొట్టిముక్కల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న రాఘవాచారి